ప్రజాశక్తి

ఆదివారం 17 డిసెంబర్ 2023

5

పార్వతీపురం మన్యం

జిల్లా సమగ్రాభివృద్ధిపై నేడు సదస్సు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అసమానతలేని సమగ్రాభివృద్ధిపై జిల్లా సదస్సు ఆదివారం స్థానిక బెలగాం సెంటర్, చర్చి కమ్యూనిటీ హాల్లో జరగనుందని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకులు, పార్టీ రాష్ట్ర నాయకులు, వివిధ సంఘాలు, రంగాల నాయకులు, కవులు, సామాజికవేత్తలు, ప్రముఖులు, మేధావులు హాజరవుతారన్నారు. జిల్లా సమాజాభివృద్ధికి చేయాల్సిన కృషి, భవిష్యత్ పోరాట కార్యాచరణపై చర్చ ఉంటుందని చెప్పారు. జిల్లా సమగ్రాభివృద్ధిని కాంక్షించే వారంతా ఆహ్వానితులేనని, అందరూ హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ పాల్గొన్నారు.

సమ్మె మరింత ఉధృతం

సాలూరులో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

- తాళాలు పగులగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి
- నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని అంగన్వాడీల నిరసన
- పలుచోట్ల ర్యాలీలు, మానవహారాలు

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

బలవంతంగా కేంద్రాలను తెరచి, అంగన్వాడీ కేంద్రాలను నడపడితే, తదనంతర పరిణామాలకు బాధ్యత ఎవరు వహిస్తారని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పార్వతీపురం ప్రాజెక్టు నాయకులు మద్దిరాపు అలివేలు, సాలూరు గౌరీమణి ప్రశ్నించారు. ఎన్నికల ముందు సిఎం ఇచ్చిన హామీలను నెరవేర్చమని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చేపట్టిన నిరవధిక సమ్మె ఐదో రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా ప్రాజెక్టుల కార్యకర్తలు ప్రభుత్వ వైఖరికి నిరసనగా నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలియజేశారు. అనంతరం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావుకు మేరకు వినతి అందించారు. సమ్మెకు సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకట రమణ, బంకురు సూరిబాబు మద్దతు తెలిపారు.

సాలూరు: తమ డిమాండ్లు ఆమోదించే వరకు పోరాటం ఆపేది లేదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎన్వై నాయుడు, బి.రాధ స్పష్టం చేశారు. సమ్మెలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఎర్ర చీరలు కట్టుకొని నోటికి నల్లరిబ్బన్లతో నిరసన వ్యక్తం చేశారు. తొలుత ఎమ్మెల్సీ సాబ్జీ మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్యామల, నారాయణ మ్మ, శశికళ, వరలక్ష్మి పాల్గొన్నారు.

కొమరాడ : అంగన్వాడీలు ఎరుపు చీరలు, నల్ల బ్యాడ్జీలు ధరించి ఐసిడిఎస్ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. తొలుత అంతర్రాష్ట్ర రహదారిపై బిక్షాటన చేస్తూ విన్నూత రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి నిరసనకు మద్దతు తెలిపారు. సమ్మెకు టిడిపి నాయకులు బిడ్డికి తమ్మయ్య, మరడాన వెంకట నాయుడు. బత్తిలి శ్రీను మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: అంగన్వాడీల సమ్మెలో భాగంగా ఎరుపురంగు చీరలు కట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బంటు దాసు, కరణం రవీంద్ర,హెల్పర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ గౌరమ్మ, ఎం.సరస్వతి పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

మక్కువ : అంగన్వాడీల దీక్షా శిబిరాన్ని టిడిపి పొలిట్బ్యూరో సభ్యులు గుమ్మిడి సంధ్యారాణి సందర్శించి సంఘీభావం తెలిపారు. తొలుత గిరిజన సంఘం మండల నాయకులు టి.ప్రభాకర్, అంగన్వాడీసంఘం మండల నాయకులు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడుతో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్సీ సాబ్జీకి సంతాపం తెలిపారు. అంగన్వాడీ మండల నాయకులు పద్మ, సుశీల, సీతమ్మ, గౌరీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట: అంగన్వాడీలు పురవీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ నల్ల బ్యాడ్జీలు కట్టుకొని మోకాళ్లపై నడిచి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యలు పరిష్కార సాధనకై ఎంతవరకైనా వెళ్తామని ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వంజరాపు సత్యం నాయుడు పాల్గొన్నారు.

పాలకొండ : అంగనవాడీల సమ్మెలో భాగంగా స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఎర్రచీరలు ధరించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి హిమప్రభ, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు జెస్సీబాయ్, అమరవేణి మాట్లాడుతూ ప్రభుత్వం అంగనవాడీలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని అన్నారు.

పాచిపెంట : అంగన్వాడీ ప్రాజెక్ట్ నాయకులు టి.ప్రభావతి ఆధ్వర్యాన మోకాళ్లపై నిల్చొని, కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర మాట్లాడుతూ అంగన్వాడీలపై వేధింపులకు పాల్పడితే భవిష్యత్తు పోరాటానికి సిద్ధంగా ఉంటామని హెచ్చరించారు. వీరి పోరాటానికి సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, చింత పోలిరాజు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ నాయకులు రమా, పార్వతి, మోసూరు రమణమ్మ, సరోజిని, సాయి, పూజ, ఎం.చిన్నమ్మి తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : సమ్మె శిబిరంలో నినాదాలు చేస్తున్న చిన్నారులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ఎరుపురంగు (చీరలతో,) నిరసన తెలిపారు. తొలుత రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎ.పార్వతి, ఎ.దర్శమి, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్.సురేష్, ఎం.కాంతారావు, తదితర అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అంగన్వాడీలు చేపట్టిన సమ్మెకు పాలకొండ నియోజకవర్గ తెలుగుదేశం ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, మండల టిడిపి అధ్యక్షులు సవర తోట మొఖలింగం, తోయిక సంధ్యారాణి,బీసీ సెల్ అధ్యక్షులు ఆర్.రంగనాథం, ఐటిడిపి కోఆర్డినేటర్ ఇమరక పవన, యూనిట్ ఇంచార్జ్ బిడ్డిక ప్రవీణ్ సాయి పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక పెట్రోల్ బంక్ సమీపాన జరుగుతున్న అంగన్వాడీల సమ్మెకు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, గిరిజన సంఘం నాయకులు ఎం. రమణ సంఘీభావం తెలిపారు. శుక్రవారం రోడ్డుప్రమాదం లో మృతి చెందిన ఎమ్మెల్సీ సాబ్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్కు, ఎంపిడిఒ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రాన్ని అందించారు. సిఐటియు నాయకులు ఎం.శ్రీనివాసరావు, టిడిపి మండల నాయకులు ఆరిక విప్లవ కుమార్, అంగన్వాడి వర్కర్స్ జిల్లా అధ్యక్షులు పి.సరళ కుమారి, ప్రాజెక్ట్ కార్యదర్శి జె.సరోజ, సెక్టార్ల లీడర్లు, వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : అంగన్వాడీల సమ్మె ఐదో రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరంలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఎరుపు చీరలు ధరించి, కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో యూని యన్ అధ్యక్ష కార్యదర్శులు సత్యవతి, కస్తూరి ఉన్నారు.

కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు

అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ఉంటుందని డిసిసి అధ్యక్షులు నిమ్మక సింహాచలం తెలిపారు. సమ్మె శిబిరానికి వెళ్లి సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మూటక లక్ష్మయ్య, గిరిజన విభాగం అధ్యక్షులు కిల్లక రాఘవేంద్ర ఉన్నారు.

సీతానగరం: స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె కొనసాగించారు. ఎంపిడిఒకు, తహశీల్దార్కు వినతులను అ ందజేశారు. సమ్మెకు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు మద్దతు తెలిపారు. శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.రామలక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సత్యవతి, రెడ్డి లక్ష్మి, యశోద, సునీత, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ వై.రామా రావు పాల్గొన్నారు.

పాలకొండలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

బలిజిపేటలో మెయిన్రోడ్డుపై మోకాళ్లపై నిరసన

పార్వతీపురంలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

గుమ్మలక్ష్మీపురంలో అంగన్వాడీలకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆరబెట్టిన ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టరేట్ నిశాంత్కుమార్

సంక్రాంతిలోగా ధాన్యం సేకరణ

బ్యాంకు గ్యారెంటీ సమర్పించక పోతే ఇతర జిల్లాల మిల్లర్లకు అవకాశం : కలెక్టర్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

జిల్లాలో ధాన్యం సేకరణ సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని, అనివార్య కారణాల వల్ల జాప్యం జరిగితే జనవరి 20 నాటికి పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. మండలంలోని గొట్టివలసలో ధాన్యం సేకరణ కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ధాన్యం సేకరణకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయా లేదా అని గమనించారు. తేమ శాతం, రవాణా విధానం, రవాణా వాహనాలకు జిపిఎస్ ఏర్పాటు, ధాన్యం బస్తాల పరిస్థితి, ట్రక్ షీట్ జనరేషన్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు సజావుగా జరగాలని ఆయన ఆదేశించారు.

బిజిలు సమర్పించక పోతే ఇతర జిల్లాల మిల్లర్లకు అవకాశం

మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు (బిజిలు) సమర్పించకపోతే ఇతర జిల్లాల మిల్లర్లకు అవకాశం కల్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. బిజిల జాప్యం మూలంగా ధాన్యం సేకరణలో ఇబ్బందులు తలెత్తరాదని చెప్పారు. కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.దేవుళ్లనాయక్, వ్యవసాయ అధికారి తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని గంగురేగువలస ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి విష్ణు చరణ్ శనివారం తనిఖీ చేశారు. మిల్లుల వద్ద లారీలను వెంటనే అన్ లోడ్ చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి అనుసంధానమైన వాహనాలు జిపిఎస్ విధిగా కలిగి ఉండాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం, వ్యవసాయ సిబ్బంది రైతులకు ధాన్యం కొనుగోలు ప్రక్రియపై స్పష్టమైన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రం వద్ద కస్టోడియన్ అధికారులు విధిగా ఉండాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తరాదని అన్నారు. కార్యక్రమంలో ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని కుసిమిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం ధరల పట్టికపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ధాన్యం కొనుగోలుపై ప్రజలకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో పిఎఒ హరిక్రిష్ణ, వ్యవసాయ శాఖ అధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గిరిజన విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - సీతంపేట

జాతీయ స్థాయి పోటీలకు స్థానిక బాలుర గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జావెలిన్త్రో విభాగంలో బిడ్డిక దినేష్ గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదే విధంగా ట్రిపుల్ జంప్ విభాగంలో ఊయక భద్ర సిల్వర్ మెడల్ సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 24న మహారాష్ట్రలోని చంద్రపూర్లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతారు. వీరిని ఐటిడిఎ పీవో కల్పనాకుమారి అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకు అవసరమయ్యే సహకారం అందిస్తామన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. వీరితో పాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న పలువురు క్రీడాకారులను పిఒ అభినందించారు. కార్యక్రమంలో ఎపిఒ వై.రోసిరెడ్డి, డిడి జి మంగవేణి, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానందం, బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపల్ పి నాగభూషణరావు, పీడీ లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న జెసి గోవిందరావు

తల్లిదండ్రుల పర్యవేక్షణ పిల్లల విజయానికి సోపానం

ప్రజాశక్తి - పాచిపెంట

తల్లిదండ్రుల పర్యవేక్షణ పిల్లల విజయానికి సోపానమని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రత్యేక అధికారిగా తల్లిదండ్రులతో పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పట్ల దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు బోధన చేసి, ఆ అంశాన్ని బాగా అర్థం చేసుకోవాలన్నారు. దీన్ని ఇంటి వద్ద సమయం కేటాయించి నేర్చుకొనే పర్యవేక్షణ తల్లిదండ్రులు చేయాలన్నారు. మార్చి 18 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం అవుతాయని చెప్పారు. టెన్త్ ప్రతి విద్యార్థికి కీలకమన్నారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కొద్ది సేపు పర్యవేక్షణ బాధ్యతలను తీసుకుంటే ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ఇంకా సరిగ్గా రెండు నెలల కాలం ఉందని, వారిపై దృష్టి సారించాలని సూచించారు.

విశ్వనాధపురంలో ధాన్యపు కొనుగోళ్ల పరిశీలన

జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాధపురంలో ధాన్యపు కొనుగోళ్లను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ ఎకరాకు వచ్చిన దిగుబడి ఎకరానికి అయ్యే పెట్టుబడి గురించి ఆరా తీశారు. తుపానులో జరిగే పంట నష్టాల గురించి రైతులను ప్రశ్నించగా గ్రామంలో పెద్దగా పంట నష్టాలు జరగలేదని తెలిపారు. ధాన్యం సంచులను తనిఖీ చేసి రైతులకు ఇవ్వాలని విఎఎలను ఆదేశించారు. రైతులకు అందుబాటులో ఉండి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. తేమ 17శాతం లోపు ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలని, నాణ్యత ప్రమాణాలను జాగ్రత్తగా పరిశీలించి ధాన్యపు కొనుగోలు జరపాలని కొనుగోలు సిబ్బందిని ఆదేశించారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

మండలంలోని అమ్మవలస అంగన్వాడీ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. అంగన్వాడీ నిర్వహణ తీరు, అంగన్వాడీ పరిధిలో గర్భిణీలు, బాలింతలు, రక్తహీనత కలిగిన వారు తదితర వివరాలు పరిశీలించారు. పౌష్టికాహారం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ లక్ష్మీకాంత్, తహశీల్దార్ రాజశేఖర్, వ్యవసాయ అధికారి తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

జనవరి 23న పోలమాంబ జాతర

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

శంబర పోలమాంబ జాతర మహోత్సవాలు రాష్ట్ర ఉత్సవంగా వచ్చే జనవరి 22,23,24 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు ఆర్డిఒ కె.హేమలత తెలిపారు. మక్కువ మండలం శంబర జాతరపై శనివారం ఆర్డిఒ తన కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతర ప్రశాంతంగా సజావుగా జరగాలన్నారు. జాతరకు వచ్చే ప్రతి యాత్రికులు పూర్తి సంతృప్తితో తిరిగి వెళ్లాలని, అందుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలని కోరారు. గత అనుభవాల దృష్ట్యా లోపాలను సవరించుకుంటూ విజయవంతంగా చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పోలీస్ బందోబస్తు తగినంత ఏర్పాటు చేసి, ఎటువంటి సంఘటనలు జరగకుండా చూడాలని పోలీస్ శాఖను కోరారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులూ ఉండరాదన్నారు. మరుగుదొడ్లు సిద్ధం చేయాలన్నారు. పారిశుధ్యం పక్కాగా ఉండాలని, పార్వతీపురం, సాలూరు మున్సిపాలిటీల నుంచి కార్మికులు, వాహనాలను పంపించాలన్నారు. జాతర అనంతరం గ్రామంలో పూర్తి పారుశుధ్యం నెలకొనాలని స్పష్టం చేశారు. అమ్మవారి మారు జాతర ముగిసే మార్చి వరకు ప్రతి మంగళవారం పారిశుధ్యంపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. పార్కింగ్ స్థలాలు, వాటికి ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాలు పక్కాగా ఉండాలని, స్వచ్ఛంద కార్యకర్తలు ఉండాలని ఆమె పేర్కొన్నారు. అంబులెన్సులు వెళ్లేందుకు రహదారి అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఫీడర్ అంబులెన్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరాలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ప్రతి రహదారి మలుపు (కర్వ్) వద్ద విద్యుత్ కాంతులు ఉండాలన్నారు. వనం గుడి వద్ద కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలన్నారు. అగ్నిమాపక యంత్రాలను ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ప్రజలకు సమాచారం ఇచ్చుటకు, మైక్ ల ద్వారా ప్రకటించుటకు పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేయాలని అన్నారు. రవాణాకు ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని రహదారులు భవనాలు శాఖను సూచించారు. తగిన బస్సులు ఏర్పాటు చేయాలని ప్రజా రవాణా శాఖను సూచించారు. ప్రసాదం తయారీలో పరిశుభ్రత విధిగా పాటించాలని - ఎటువంటి కల్తీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా దేవాదాయశాఖ అధికారి డివివి ప్రసాదరావు జాతర తేదీలను వివరించారు. ఈనెల 18న పెద్దమ్మ వారి చాటింపుతో ప్రారంభమై 2024 మార్చి 26 జరిగే చండి హెూమం, మహాన్నదానంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. జనవరి 22న తొలేళ్లు, 23న సిరిమానోత్సవం, 24న అనుపోత్సవం జరుగుతాయని చెప్పారు. జనవరి 30 నుండి మార్చి 26వరకు మారు జాతర పది వారాలు జరుగుతాయని వివరించారు. డీఎస్పీ జి.మురళీధర్ మాట్లాడుతూ 4గురు డీఎస్పీలు, 12 మంది సిఐలు, 38 మంది ఎస్ఐలతో సహా మందిని గత ఏడాది బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

సమావేశంలో జిల్లా విపత్తు స్పందన అధికారి కె శ్రీనివాస బాబు, ఆర్డబ్ల్యుఎస్ అధికారి ఓ ప్రభాకరరావు, ప్రజా రవాణా డిపో మేనేజర్ ఇకెకె దుర్గ, వైద్య శాఖ ప్రోగ్రాం అధికారి డా ఎం వినోద్, సాలూరు తహశీల్దార్ ఆర్.బాలమురళి, మక్కువ ఎంపిడిఒ పి.దేవకుమార్, పోలమాంబ దేవాలయ ఇఒ వివి నారాయణ, దేవస్థానం మాజీ చైర్మన్ పూడి దాలినాయుడు, ఎంపిటిసి తీళ్ల పోలినాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా సిరిమానోత్సవ ఏర్పాట్లు : ఆర్డిఒ

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డిఒ హేమలత

ఎస్ఐ బాధ్యతలు స్వీకరణ

బలిజిపేట : స్థానిక ఎస్ఐగా వి.పాపారావు శనివారం బాధ్యత లు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ప్రశాంత్ కుమార్ పాలకొండకు బదిలీ అయ్యారు.

అతివేగంతో గాల్లో ప్రాణాలు

ఏజెన్సీలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఇటీవల కాలంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో రేష్ డ్రైవింగ్ వల్ల తరచూ ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు గాలిల్లో కలిసిపోతున్నాయి. డ్రైవింగ్ పట్ల కనీస అవగాహన లేని యువత లైసెన్స్ లేకుండా అతివేగంతో మోటార్ సైకిళ్లు నడపడం పరిపాటిగా మారింది. అతివేగం ప్రమాదకరమని ప్రతి చోటా ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్న అవి పట్టించుకోవడం లేదు. పలు సందర్భాల్లో తాము నడుపుతున్న వాహనం పరాయి వారిదే అయినప్పటికీ ఏ మాత్రం జాగ్రత్తలు పాటించకుండా వెళు న్నారంటే ఎంత బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారో ఇట్టే అర్థమవుతుంది. రేష్ డ్రైవింగ్ చేయడం ఫ్యాషన్ అనుకుంటున్నారే తప్ప ఎదుటివారి చావుకు తాము కారణమని భావించడం లేదు. రేష్ డ్రైవింగ్తో ప్రమాదాలు తరకూ ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. ఇందులో భాగంగానే పాలకొండ పోలీస్ స్టేషన్లో విధులకు వెళ్తున్న కానిస్టేబుల్ సత్యనారాయణ మోటార్ బైక్ను యువత మోటార్ సైకిల్తో బలంగా ఢీ కొట్టడంతో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. మలుపులు ఉన్నచోట ప్రమాద హెచ్చరిక బోర్డులు ఉన్నా ట్రాఫిక్ నిబంధన పాటించకుండా అతి వేగంగా ప్రయాణిస్తున్నారు. 18 ఏళ్లు నిండని మైనర్లు డ్రైవింగ్ చేస్తూ తరచూ ప్రమాదాలకు గురవుతూనే ఉన్నారు. ఇటువంటి వారిపై పోలీసులు దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

అతివేగంతో ఢీకొన్న బైకులు (ఫైల్)

ఆశాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైద్యాధికారి, హెచ్వి

ధర్నాకు వెళ్లారని ఆశాలపై వైద్యాధికారుల ఆగ్రహం

అధికారుల తీరుకు సిఐటియు ఖండన

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఆశా వర్కర్లపై వైద్యాధికారి, సీనియర్ అసిస్టెంట్, హెచ్విలు శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిష్కారానికై ఈనెల 14,15 తేదీల్లో కలెక్టరేట్ వద్ద తలపెట్టిన 36 గంటల ధర్నాకు ఆశా కార్యకర్తలు వెళ్లినందుకు వైద్యాధికారులు వీరిపై విరుచుకుపడ్డారు. ఈ సంఘటనను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు ఖండించారు. ఆశా వర్కర్లను వైద్యాధికారులు భయాందోళనలకు గురి చేయడం పద్ధతి కాదన్నారు. ఆశాల సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే వారి సమస్యల పరిష్కారానికి సహకరించాలి తప్ప ఇలా భయాందోళనకు గురి చేయడం పద్ధతి కాదన్నారు. జిల్లాలో అన్ని పిహెచ్సిల పరిధిలోని ఆశా వర్కర్లు ఆయా వైద్యాధికారులకు ముందుగానే ధర్నా నోటీసులు అందజేసినప్పటికీ ఇక్కడి వైద్యాధికారి అంగీకరించలేదని, పైగా ఎవరైనా తనకు చెప్పకుండా వెళ్తే వారిపై చర్యలు తీసుకుంటానని వైద్యాధికారి కిరణ్మయి, హెచ్వి భయ పెట్టారని తెలిపారు. ముఖ్యంగా హెచ్వి తన పై అధికారి ఉన్నప్పటికీ తానే ఆధిపత్యం వహించి అంతా తానై ఆశా కార్యకర్తలపై నోరు జారడం, అలాగే సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్ కూడా పై అధికారి మాటలను పక్కనపెట్టి తానే పైఅధికారిగా వ్యవహరించి ఆశా కార్యకర్తలపై దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. తక్షణమే వారితో క్షమాపణ చెప్పించాలని, లేకుంటే మానవ హక్కుల ఉల్లంఘనేనని ఆయన అన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

వయోజనలంతా ఓటరుగా నమోదు కావాలని కోరుతూ ఓటరు నమోదు కార్యక్రమంపై శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో నోడల్ అధికారి వి.మంజుల వీణ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో ఓటు అక్షరాలు తలపిస్తూ క్రమపద్ధతిలో కూర్చుని ప్రజలను ఆకట్టుకొన్నారు. ప్రిన్సిపల్ జె.రామారావు ఆధ్వర్యంలో ఉపన్యాసకులు ఆకుల రాజు, తెర్లి రవికుమార్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, లక్ష్మణరావు, శర్మ ,వెంకటేశ్వరరావు, కైలాష్ శ్రీధర్, రవికాంత్, రవి, రామకృష్ణ, సుధాకర్, విద్యార్థులతో కలిసి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఓటు నమూనాలో విద్యార్థులు


సమావేశంలో మాట్లాడుతున్న విఆర్ఎల సంఘం నాయకులు ఈశ్వరరావు

సిఎం మాటలు నీటి మూటలేనా ?

ప్రజాశక్తి - కలెక్టరేట్

ముఖ్యమంత్రి మాటలు నీటి మాటలేనానని విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు విమర్శించారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విఆర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ప్రతిపక్ష నేతగా, ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విఆర్ఎల సమస్యలపై విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా చేస్తున్న విఆర్ఎల వద్దకు వచ్చి అధికారంలోకి వచ్చి వారం రోజుల్లోనే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చి నాలుగున్నరేళ్లయినా నేటికీ పరిష్కరించపోవడం దారుణమని అన్నారు. విఆర్ఎల మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు జరిగిందని. ఇందుకు రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు దశల వారి ఉద్యమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 21న మండల కార్యాలయాల్లో తహశీల్దార్‌కు వినతులు, 28న కలెక్టరేట్‌లో ధర్నా, జనవరి 5న సిసిఎల్ఎలో ధర్నా కార్యక్రమాలను జిల్లాలో తీర్మానించడమైనదని, అప్పటికీ స్పందించకపోతే భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి ఉద్యమం చేపడతామని తీర్మానించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమానికి విఆర్ఎల జిల్లా కార్యదర్శి జి.కృష్ణారావు, జిల్లాలోని విఆర్ఎలు పాల్గొన్నారు.

18న ఆరోగ్య శ్రీపై అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 18న వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రభుత్వం వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం కింద పరిమితిని రూ.25 లక్షలకు పెంచిందని, ఇది ప్రజలకు ఉపకరించే అంశమని అన్నారు. ఆరోగ్యశ్రీ కింద 3257 చికిత్సలను 2285 ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో పొందవచ్చని ఆయన చెప్పారు. హైదరాబాదు, చెన్నై, బెంగుళూరు వంటి ఇతర రాష్ట్రాల్లోని పెద్ద కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం వైద్యం పొందవచ్చని ఆయన చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం, వైఎస్ఆర్ ఆసరా, 104 కాల్ సెంటర్, 108 అంబులెన్సు సేవలు, విలేజ్ హెల్త్ క్లినిక్ తదితర అంశాలతో పాటు ఆసుపత్రిలో అనేక ఉచిత సదుపాయాలను అందిస్తామన్నారు. సమావేశంలో డిఆర్ఓ జె.వెంకటరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథరావు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయ అధికారి కొయ్యాన అప్పారావు, ఎస్డిసి జి కేశవ నాయుడు పాల్గొన్నారు.

తెరిచారు... మూసేశారు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మధ్యాహ్నానికి మూతపడిన కేంద్రం

పట్టణ పరిధిలో గల 56 అంగన్వాడీ కేంద్రాలను గురువారం సాయంత్రం, శుక్రవారం ఐసిడిఎస్, మున్సిపల్ అధికారులు, సచివాలయాల సిబ్బంది బలవంతంగా తాళాలు పగలగొట్టి, కేంద్రాల లోపల ఉన్న పౌష్టికాహారాల నిల్వలను నమోదు చేసుకుని వేరొక తాళాలను వేసిన విషయం తెలిసిందే. అయితే శనివారం ఉదయం 8.30 గంటలకు అంగన్వాడీ కేంద్రాలను తెరచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిరీక్షించినప్పటికీ అంగన్వాడీ కేంద్రాలకు చిన్నారులు రాకపోవడంతో సచివాలయాల సిబ్బంది కేంద్రాలను మూసివేసి వెళ్లిపోవడం గమనార్హం.

మహిళా మార్టును ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ అప్పలనాయుడు

స్వయం సమృద్ధి కోసమే మహిళా మార్ట్‌లు

ప్రజాశక్తి - సాలూరు

మహిళల స్వయం సమృద్ధి కోసమే రాష్ట్ర ప్రభుత్వం మెప్మా ఆధ్వర్యాన మహిళా మార్ట్ లను ప్రారంభిస్తోందని మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు అన్నారు. శనివారం మెప్మా ఆధ్వర్యాన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద నిర్వహించిన మహిళా మార్ట్‌ను వారు పరిశీలించారు. పట్టణంలోని డ్వాక్రా మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులతో నిర్వహిస్తున్న మార్ట్ వారి జీవనోపాధి మెరుగుదలకు దోహదపడుతుందన్నారు. మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గొర్లి వెంకటరమణ, పి.సన్యాసమ్మ, పి.మధుసూధనరావు, వైసిపి నాయకులు పతివాడ శివ,మేకల శంకరరావు,మెప్మా సిఎంఎం ఎ.పుష్ప,సిసి లెంక గణపతి,సిఆర్పిలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నాగూరు విద్యార్థులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని నాగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ఇటీవల నిర్వహించిన మండలస్థాయి, జిల్లా స్థాయి ఆటల పోటీల్లో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై అక్కడి పోటీల్లో పాల్గొన్నారు. ఈమేరకు పాఠశాలలో చదువుతున్న దత్తి సాయికుమార్ అండర్-17లో లాంగ్ జంప్, దత్తి నిత్యశ్రీ అండర్‌తో బాల్, ఎం.సౌందర్య నెట్ బాల్, సిహెచ్ గిరిప్రసాద్ త్రోబాల్, అజ్జాడ అశోక్ నెట్ బాల్, ఎస్ ఎస్ భానుశ్రీ అండర్-14 త్రో బాల్‌పోటీల్లో పాల్గొన్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐ.రాజేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు జి నాగేంద్రనాయుడు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను శ్రీచంద్రశేఖర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కేతిరెడ్డి కూర్మి నాయుడు, కేతిరెడ్డి అచ్యుతరావు, అక్కేన వెంకటనాయుడు అభినందించారు.

హడ్డుబంగి పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను శనివారం ఎంపిడిఒ కె.గీతాంజలి సందర్శించారు. ఎస్ఎ-1 పరీక్షలో టాప్ మార్కులు వచ్చిన విద్యార్థులను అభినందించారు. పదో తరగతి పరీక్షలకు సమయం తక్కువ ఉందని, కావున ప్రణాళికతో చదివితే ఉత్తీర్ణత తప్పనిసరిగా సాధించవచ్చని అన్నారు. విద్యార్థినిలకు విద్యతో పాటు క్రమశిక్షణ అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.ఉమావాణి, డిప్యూటీ వార్డెన్ మల్లిక ఉన్నారు.

18న ఫీల్డ్ అసిస్టెంట్ల ధర్నా

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఈనెల 18న కలెక్టరేట వద్ద ధర్నా చేయనున్నట్టు ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా కార్యదర్శి మండంగి హరినాథ్ తెలిపారు. అలాగే జనవరి 5న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కావున రెండు రోజులు ఫీల్డ్ అసిస్టెంట్లు విధులకు హాజరు కారని తెలియజేస్తూ శనివారం ఎంపిడిఒ ఆకిబ్ జావేద్ కు రాతపూర్వకంగా తెలియజేసినట్లు హరినాథ్ తెలిపారు.

అంతర కళాశాలల అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - సాలూరు

ఇటీవల ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన అంతర కళాశాల అథ్లెటిక్స్ మీట్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శనివారం కళాశాలలో పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాస్, పిడి ఎ.శివాజీ అభినందించారు. 5 కిలోమీటర్లు, 10కిలోమీటర్లు పరుగు పందెంలో బంగారు పతకం సాధించిన ఎం.హరీష్, 20కిలోమీటర్ల రేస్ వాక్‌లో, షార్ట్ పుట్‌లో కాంస్య పతకాలు సాధించిన ఎం.ఏకాంబరం, వి.వేలంగినిని వారు అభినందించారు.

నేల విడిచి సాము

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

బలవంతుని నాకేమని నిగ్రహించి పలుకుటమేల... బలవంతమైన సర్పం చలిచీమల చేత చిక్కి చావదె సుమతీ... అన్నాడు ఓ పద్యకవి. అచ్చంగా ఆ తీరును సిఎం జగన్మోహన్‌రెడ్డి, వైసిపి ప్రభుత్వం వంట బట్టించుకోవాల్సిన అవసరం ఉందని చాలా మంది జనం అభిప్రాయపడుతున్నారు. రెప్పపాటులో ఒక్క కాటుతో సమస్త జీవరాసుల ప్రాణాలను తీయగల శక్తి సామర్థ్యాలు విషసర్పానికి ఉంటాయి. అంతమాత్రాన తనను మించిన జీవరాశి లేదనుకుంటే పొరపాటే. విష సర్పమైనా చలి చీమలు కూడా చుట్టుముడితే చావాల్సిందే. ఇక్కడ చావు, బతుకుల సమస్య కాకపోయినప్పటికీ ఓవైపు అంగన్‌వాడీల ఆకలి కేకలు, అభద్రతా భావాలు, హక్కులు, అక్రోశాలు... మరోవైపు ప్రభుత్వ అధికార దుర్పం. అధికార దుర్వినియోగం. పదవీగర్వం మధ్య పెనుగులాట జరుగుతోంది. పదవులు, అవి ఇచ్చిన అధికారం గొప్పవే. కానీ, గొప్ప తనం కల్పించింది మాత్రం ప్రజలు, వారికి సేవచేస్తున్న ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు. ఈ విషయం మరిచిపోతే నేల విడిచి సాముచేసినట్టే లెక్క. ప్రభుత్వం ఇటువంటి లెక్కలనే మర్చిపోతున్నట్టుగా కనిపిస్తుందని జనం చర్చించు కుంటున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు గత ఐదురోజులుగా రాష్ట్ర వ్యాప్తంగాను, జిల్లాలోను సమ్మె చేస్తూ శాంతియుతంగా నిరసన దీక్షలు చేపడుతున్న సంగతి తెలిసిందే. వారేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. ఎన్నికలకు ముందుకు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను మాత్రమే నెరవేర్చాలని కోరుతున్నారు. గౌరవ ప్రదంగా బతుకీడ్చేందుకు తెలంగాణాలోని అంగన్‌వాడీల కన్నా ఎక్కువ వేతనాలు ఇస్తామన్న మాటను నిలబెట్టుకోవాలని మాత్రమే కోరుతున్నారు.

బిల్లుల బాకాయి చెల్లించి అప్పుల ఊబినుంచి గట్టెక్కించమంటున్నారు. ఉద్యోగ విరమణ అనంతరం బతుకుకీడ్చుకునేందుకు పింఛను రూపంలో భోరోసా కల్పించమని కోరుతున్నారు. ఊచ్ అంటే ఊడిపోయే విధంగా కాకుండా ఉద్యోగ భద్రత కల్పించమని వేడుకుంటున్నారు. అక్షరాల అంగన్‌వాడీ కోరికలు ఇవే. వీటన్నింటినీ నెరవేరుస్తామనిఅధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదు సరికదా అంగన్‌వాడీలపై ఉక్కుపాదం మోపేందుకు బరితెగించింది. అధికారంలోకి వచ్చాక అనేక సార్లు అంగన్‌వాడీలను అరెస్టులు చేయడం, నిర్బంధాలకు పాల్పడడం, బెదిరింపులకు దిగడం తెలిసిందే. ఇప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఇటీవల సమ్మె నోటీసు ప్రభుత్వానికి ఇచ్చారు. అయినా ప్రభుత్వం దిగిరాకపోవడంతో ఈనెల 12నుంచి సమ్మెసైరన్ మోగించారు. విజయనగరం, పార్వతీపురం జిల్లాల కలెక్టరేట్ల వద్ద, ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద రోజూ నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ధర్నా, దీక్షలు, రాస్తారోకో, నల్లబ్యాడ్జీలు, కళ్లకి గంతలు కట్టుకోవడం వంటి రూపాల్లో నిరసన జ్వాల కొనసాగుతోంది. వీరికి రోజు రోజుకూ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు,ఉద్యోగ సంఘాల నుంచి మద్దతు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో చర్చలకు ఆహ్వానించి, సానుకూలంగా స్పందించాల్సిన ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను సచివాలయం, ఐకెపి ఉద్యోగులతో తెరిపించేందుకు ఆదేశాలిచ్చింది. అధికారుల ఒత్తిడితో అక్కడక్కడ ఈ వ్యూహం నెరవేరినప్పటికీ మెజార్టీ కేంద్రాలు తెరుచుకోలేదు. పైగా ఈ పనులు తాము చేయలేమంటూ సచివాలయం, ఐకెపి ఉద్యోగులు చేతులెత్తేస్తున్నారు. మరోవైపు బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చినప్పలనాయుడు అంగన్‌వాడీలపట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడంపై అంగన్‌వాడీలంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రోజు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించని ప్రభుత్వం రేపు తమపై కనికరం చూపుతుందా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇంకాస్త లోతుగా ఆలోచించినవారు సమ్మెను విచ్ఛినం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, ఈ సమస్యలు ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు ఒక్కటి కావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. చాలా మంది ప్రభుత్వ చర్యలను దుయ్య బడుతున్నారు. సమస్యలు పరిష్కరించకుండా ఒకిరిపనులు ఒకరికి అప్పగిస్తే ప్రభుత్వానికే చెడ్డపేరు వస్తుందని, తద్వారా రాజకీయంగా నష్టం జరుగుతుందని చెప్పు కుంటున్నారు. ఆ మాట కొస్తే చరిత్ర కూడా ఇదే. ప్రభుత్వ వ్యవస్థలో అంగన్‌వాడీల పాత్ర అత్యంత కీలకమైనది. క్షేత్ర స్థాయిలో జనాలను ప్రభావితం చేయగల సత్తా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉంది. ఈ విషయం గతంలో చంద్రబాబు, వైఎస్ రాజశేఖరెడ్డి ప్రభుత్వాల్లోనూ రుజువైంది. చంద్రబాబు గుర్రాలతో తొక్కించడం, వైఎస్ఆర్ అరెస్టులతో ఇబ్బందులకు గురిచేయడం వంటి సందర్భాల్లో ఆయా ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. తాజాగా అవే విషయాలను అంగన్‌వాడీలు, స్కీమ్ వర్కర్లు, ఇతర ఉద్యోగులు గుర్తు చేస్తున్నారు.

ఎస్‌పి విక్రాంత్‌కి ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఎస్‌పికి అవార్డును అందజేస్తున్న డిజిపి

ప్రతిష్టాత్మక డిజిపి డిస్క్ కమెండేషన్ అవార్డుకు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం డిజిపి కెవి రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. కన్విక్షన్ బెస్ట్ పోలీసింగ్, 'దిశ', శాంతిభద్రతల విభాగంలో అత్యుత్తమ పనితీరు కనబరచిన ఐపిఎస్ అధికారులకు ప్రతి ఏటా కమెండేషన్ అవార్డులు ఇవ్వడం ఆనవాయితీ గా వస్తోంది. ఈ క్రమంలో భాగంగా మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జరిగిన అవార్డుల ప్రధాన కార్యక్రమంలో విక్రాంత్ పాటిల్ డిజిపి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఎల్విన్ పేట సర్కిల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ తిరుమలరెడ్డికి డిజిపి కెవి రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా డిస్క్ కమెండేషన్ అవార్డు అందుకున్నారు. తిరుమలరెడ్డి సేవలను గుర్తించి అవార్డును ప్రధానం చేశారు. తిరుమల రెడ్డికి అవార్డు రావడం పట్ల సిఐ సత్యనారాయణ, తోటి సిబ్బంది అభినందించారు.

సమస్యలపై గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి- కలెక్టరేట్

మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పార్వతీపురం ఐటిడిఎ అధికారుల వైఖరి, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ జిల్లా శాఖ పక్షాన శనివారం స్థానిక ఐటిడిఎ వద్ద ఉపాధ్యాయులు మోకాళ్లపై నిరసనను తెలిపారు. ఏడాదిగా యుటిఎఫ్ డిమాండ్ మేరకు ప్రధానోపాధ్యాయుల ఉద్యోగోన్నతిపై స్పందించిన పిఒకు యుటిఎఫ్ ధన్యవాదాలు తెలిపింది. అదే సందర్భంలో ప్రమోషన్ల అర్హతపై పారదర్శకత లేకుండా చేశారని, కింద స్థాయి అధికారులు పిఒను తప్పు దోవ పట్టిస్తున్నారని, అర్హతలు లేకుండా అర్హతలు ఉన్నట్లుగా క్లారిఫికేషన్ ఇచ్చారని దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి. రమేష్, ఎస్.మురళీమోహనరావు డిమాండ్ చేశారు. అలాగే పని సర్దుబాటు అనే పేరుతో తమకు నచ్చిన వారిని డెప్యుటేషన్లు వేశారని, సబ్జెక్టు టీచర్ల కొరత పేరుతో బాలికల పాఠశాలలకు రెగ్యులర్ వారిని కాకుండా కాంట్రాక్ట్ వారిని వేశారని ఈ విషయంలో ముడుపులు ముట్టినట్లు భావిస్తున్నామని అన్నారు. అలాగే సవర భాషావాలంటీర్ల జీతాలు చెల్లించకుండా జాప్యం జరుగుతుందని, జాతపు వాలంటీర్లను నియమించేందుకు ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. హెచ్ఎంలకు ప్రమోషన్లు ఇచ్చినప్పటికీ స్కూల్ అసిస్టెంట్ కేడర్ ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు కె.భాస్కరరావు, కె.మురళి, ఎన్.శ్రీనివాసరావు, పి.వెంకట నాయుడు, మండల నాయకులు పాల్గొన్నారు.

విబిఎస్‌వైలో 25 వేల మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - కొమరాడ

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో నిర్దేశించిన వైద్య పరీక్షలను పక్కాగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు ఆయన సివినిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర (విబిఎస్ వై)కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. అక్కడ ప్రజలకు వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న పరీక్షలను, వాటి నివేదికల వివరాలను పరిశీలించారు. ఎంత మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు, సికిల్‌సెల్ అనీమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఎంతమందిని రిఫర్ చేశారు, పిఎం జనారోగ్య యోజన కార్డులను ఎంతమందికి అందజేశారు తదితర అంశాలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ జిల్లాలో రోజుకు 8క్యాంపులు చొప్పున నాలుగు మండలాల్లో కొనసాగిస్తున్నామని, ఇందుకు నాలుగు వాహనాల ద్వారా వైద్య సేవలను ఆయా పంచాయతీ గ్రామాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 180 విబిఎస్ వై క్యాంప్‌ల్లో 25,471 మందికి ఆరోగ్య తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.శిరీష, సర్పంచ్ బి.పుష్పలత, పిహెచ్ఎన్ విజయకుమారి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల పెన్‌డౌన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

నిరసన తెలుపుతున్న సర్వశిక్ష ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగులకు తక్షణమే పెండింగ్ బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం నుంచి పెన్‌డౌన్ కార్యక్రమం చేపడుతున్నారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో పెన్‌డౌన్ కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం ఎంఇఒ నగిరెడ్డి నాగభూషణరావుకు సమగ్రశిక్ష ఉద్యోగులు బోను రామకృష్ణ, రేగిడి రాంబాబు, రమణమ్మ, వాకాడ శారద, తదితరులు నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగు జీతాలను తక్షణమే విడుదల చేయడంతో పాటు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రస్తుతం పెన్డౌన్ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఈనెల 20లోగా సమస్యల పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేయనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఆర్పిలు ఎడ్ల యశోద, ఎం.శంకరరావు, ఐసిఆర్‌టి యర్రా వీర్రాజు, తది తరులు పాల్గొన్నారు.

టీకాల కార్యక్రమానికి ఎంఎల్‌హెచ్‌పిలు గైర్హాజరు

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని చిన్నపిల్లలు ముందస్తుగా ఎటువంటి అనారోగ్యాలకు గురికాకుండా ఉండేందుకు ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే టీకాల కార్యక్రమానికి ఎంఎల్‌హెచ్‌పిలు గైర్హాజరైన సంఘటన మండలంలోని మొండెంఖల్ పిహెచ్‌సి పరిధిలో గల పెదగొత్తిలి, మరిపల్లి, గుమ్మ, పి.లేవిడి, జి.శివడ, ఉదయపురం, సచివాలయాల్లో జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ టీకాలు ఎఎన్ఎంలు వేస్తున్నారని ఆ సమయంలో పిల్లలకు ఏడవర్స్ రియాక్షన్ ఒకవేళ వస్తే చిన్నపిల్లలని ఎవరు చూస్తారని, దీనికి బాధ్యత ఎవరు వహిస్తారని వైద్య సిబ్బందిని నిలదీశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బి.ప్రజ్ఞను 'ప్రజాశక్తి' సంప్రదించగా, ఎంఎల్‌హెచ్‌పిలు తప్పనిసరిగా టీకాలు వేసే సమయంలో ఉండాలని చిన్నపిల్లలకు ఎటువంటి రియాక్షన్ అయినా వెంటనే వాళ్లు చూసి తగిన మెడిసిన్ ఇవ్వగలరని అన్నారు. అటువంటిది వారు కనీసం తనకు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరవ్వడం నిజమేనని అన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ వీధిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని శనివారం నర్సిపురం గ్రామస్తులు గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే వి.కళావతి వద్ద విన్నవించుకున్నారు. తాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సమస్య పరిష్కరించాలని విన్నవించుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకం కింద రూ.79 లక్షలు నిధులు మంజూరయ్యాయని, టెండర్లు పిలిచినప్పటికీ ఎవరు ముందుకు రావడం లేదని గ్రామస్తులకు సూచించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు చేపడతామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. అదే గ్రామంలో ఎస్టీ వీధిలో సీసీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా పనులు చేపడతామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి అందజేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యవతి, పిఎసిఎస్ అధ్యక్షులు కర్రి గోవిందరావు, సచివాలయ కార్యదర్శిఎన్.కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాన్ని పరిశీలించిన శాప్ అధికారులు

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురంలో గతంలో మంజూరైన క్రీడా పాఠశాల మైదానాలను శాప్ అసిస్టెంట్ ఇంజనీర్ పి.రాధాకృష్ణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌తో పాటు మరికొన్ని క్రీడా మైదానాలకు జిల్లా క్రీడా అధికారుల నుంచి ప్రతిపాదనలు అందాయని, వీటి స్థల పరిశీలన కోసం రావడం జరిగిందని, మరి కొద్ది రోజుల్లో పనులు ప్రారంభిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్,మండల, సర్వేయర్లు, జి.హనుమంతరావు, విలేజ్ సర్వేయర్లు బాబ్జీ, ప్రశాంత్, విఆర్ఒ జి.చిరంజీవి, వ్యాయామ ఉపాధ్యాయుల వెంకటరావు, మాధవరావు, కొండలరావు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరుకాకపోతే ఎలా?

ప్రజాశక్తి - పాలకొండ

అధికారులు సమావేశానికి హాజరుకాకపోతే ఎలా అంటూ వైస్ ఎంపిపి కనపాక సూర్య ప్రకాష్ అన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వైస్ ఎంపిపి కనపాక సూర్య ప్రకాష్ అధ్యక్షతలో మండల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధికారులు ఎవరూ హాజరు కాలేదు. కేవలం మూడు శాఖలకు సంబంధించిన అధికారులే హాజరవ్వడం పట్ల ఆయన అసంతృప్తి చెందారు. ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన సమావేశానికి అధికారులు హాజరు కాకపోవడం సరికాదన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తానని అన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఇంటి వద్ద బోధన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తూడిలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థి అర్జురావు శ్రీకాంత్‌కు ఇంటి వద్ద బోధన ఇస్తున్నట్లు ఎంఇఒ ఆర్.ఆనందరావు తెలిపారు. ఈ మేరకు శనివారం తూడి గ్రామాన్ని సందర్శించిన అర్జురావు శ్రీకాంత్ విద్యార్థి బోధన ఏ విధంగా ఉందో పరిశీలించారు. తల్లిదండ్రులు విద్యార్థి పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

తిరుమల సాయి పాఠశాలకు ఎక్స్‌లెన్సీ అవార్డు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం పెదమేరంగి తిరుమల సాయి పాఠశాల సేవలను గుర్తించి హైదరాబాద్‌కు చెందిన ఈటి టీచ్ బ్రెయిన్ ఫీడ్ సంస్థ ఎక్సలెన్సీ అవార్డును రౌతు సాయికిరణ్ నాయుడుకు అందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 23 ఏళ్లుగా విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించి, ఆధునికతను జోడించి గ్రామీణ విద్యార్థులకు గ్లోబల్ స్కిల్స్ అందించి ఉత్తమ పౌరులుగా నిలబెట్టినందుకు పాఠశాలకు అవార్డు రావడం పట్ల కరస్పాండెంట్ వెంకటరమణ సంతోషం వ్యక్తం చేశారు.

సైన్స్‌ఫేర్‌లో దోనుబాయి విన్నర్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌లో దోనుబాయి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని ఎంఇఒ ఆనందరావు, ప్రధానోపాధ్యాయులు టి.చంద్రరావు, కొండగొర్రె సుబ్బారావు తెలిపారు. ఈ విద్యార్థులు ఈనెల 23న పార్వతీపురంలో జరిగే జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొంటారని, అక్కడ నుంచి రాష్ట్రస్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు.

కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు జగదీశ్వరి పరామర్శ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ సత్యనారాయణ మృతి చెందడం బాధాకరమని కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి బంధువులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఆమె ఓదార్చారు. ఉద్యోగ నిర్వహణలో బాధ్యతతో విధులు నిర్వహిస్తూ మచ్చలేని మంచి మనిషిగా అంకిత భావంతో పనిచేస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. సత్యనారాయణ మతదేహం చూసేందుకు పాలకొండ ఎస్ఐ ప్రశాంత్ కుమార్, పోలీస్ సిబ్బంది వచ్చారు.

ఎంఆర్‌సి ఉద్యోగులకు పలు సంఘాల మద్దతు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గత కొంతకాలంగా జీతాల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మండల రిసోర్స్ కేంద్రం సిబ్బందికి పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఎపిటిఎఫ్, యుటిఎఫ్, పిఆర్టియు సంఘాలు ఎంఆర్సి సిబ్బందికి తమ మద్దతును ప్రకటించాయి. ఈనెల 16 నుండి 19 వరకు తాము పెన్డౌన్ చేస్తామని, అలాగే 20 నుండి సమ్మెలో పూర్తిస్థాయిలో పాల్గొంటామని సిఆర్పి సంఘ నాయకులు కాంతారావు, చిరంజీవి, సింహాచలం, చిట్టిబాబు, విజయకుమార్, తదితరులు ప్రకటించారు.

'చదువుతోనే ఉన్నత భవిష్యత్తు'

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

విద్యార్థులు చదువుతూనే ఉన్నత భవిష్యత్తుకు చేరుకోవచ్చని స్థానిక జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో స్టూడెంట్ లీగల్‌లిటరిసీ క్లబ్బును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కేవలం తమ లక్ష్యాల పైనే దృష్టి సారించి బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎపిజిఇఎఫ్ ఫెడరేషన్ కన్వీనర్‌గా సీతన్న

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎపి ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా కన్వీనర్‌గా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎలక్ట్రికల్ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న మల్ల సీతన్నను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ఎపిజిఇఎఫ్ అధ్యక్షులు కె.వెంకటరామిరెడ్డి నుంచి అధికారిక ఉత్తర్వులు వచ్చినట్లు సీతన్న తెలిపారు. ఈ మేరకు సీతన్నను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీముడుతో పాటు, పాఠశాల ఉపాధ్యాయులు, మండల ఉపాధ్యాయులు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కురుపాంలో తిరుగుతున్న సీజ్ చేసిన కారు

సీజ్ చేసిన కారులోఎస్ఇబి సిబ్బంది షికారు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మూలుగూడ జంక్షన్ సమీపాన గురువారం ఎస్ఇబి సిబ్బంది మాటు వేసి కారులో 20 క్యాన్లతో తరలిస్తున్న 200 లీటర్ల నాటు సారా పట్టుకున్నారు. కారును స్వాధీనం పరుచుకొని సీజ్ చేశారు. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ అదే కారుతో ఎస్ఇబి సిబ్బంది వారు వ్యక్తిగత పనులకు వాడుతూ హల్‌చల్ చేస్తూ తిరుగుతున్న సంఘటన శనివారం కురుపాంలో చోటు చేసుకుంది. సీజ్ చేసిన వాహనాలను వేలం వేసేవరకు వాటిని వాడకూడదు. కానీ మండలంలోని ఎస్ఇబి సిబ్బంది దీనికి పూర్తిగా విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. కార్లు, ఆటోలే కాకుండా ద్విచక్ర వాహనాలతే వారు ఇస్తారాజ్యంగా వాడుతూ అవి వేలం వేసే సమయానికి వాహనంలో సరైనటువంటి విడి భాగాల్లేకపోవడంతో సారాతో పట్టుబడ్డ వాహనాలు అంటే కేవలం స్క్రాప్ బల్లునన్న భావన ప్రజల్లో నెలకొంది. దీనిపై తీవ్ర ఆరోపాలు గుప్పిస్తున్నారు. అంతేకాకుండా అదే వాహనంతో ఏమైనా ప్రజలకు జరగరాని సంఘటన జరిగితే దానికి బాధ్యులెవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఎస్ఇబి సిబ్బంది ఆగడాలను అరికట్టి సీజ్ చేసిన వాహనాలను వాడకుండా ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

లోకేష్‌ను కలిసిన దత్తి లక్ష్మణరావు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

యువ గళం పాదయాత్రలో భాగంగా తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను పెందుర్తి నియోజక వర్గ పరిశీలకులు, కురుపాం నియోజకవర్గ టిడిపి నాయకులు దత్తి లక్ష్మణరావు కలిశారు. పార్టీకి వస్తున్న ఆదరణ, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు లోకేష్ కు వివరించారు. 2024 ఎన్నికల్లో టిడిపి గెలుపునకు సమిష్టిగా కృషి చేయాలని లక్ష్మణరావుకు లోకేష్ సూచించారు.

విద్యార్థులతో ఉపాధ్యాయుల సెల్ఫీలు

ప్రజాశక్తి - సీతంపేట

విద్యార్థులకు ఎస్ఎ-1, ఇతర పరీక్షల్లో అధిక మార్కులు వచ్చిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అధికారులతో సెల్ఫీ తీసుకునే అవకాశం ఉంటుందని ప్రధానోపాధ్యాయులు కొండగొర్రె సుబ్బారావు అన్నారు. మండలంలో దోనుబాయి బాలుర గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసి తల్లిదండ్రుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్జల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. దీనికి తల్లిదండ్రులు సహకరించాలని అన్నారు. సెలవుల్లో విద్యార్థులు ఇంటి వద్ద చదువుకోవాలని చెప్పారు. ఇంటి వద్ద ఉన్న పిల్లలను వెంటనే తల్లిదండ్రులు బడికి పంపించేలా చూడాలని చెప్పారు. విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందని దీనిని వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో చైర్మన్ మధుసూదనరావు, డిప్యూటీ వార్డెన్ వి.గణపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.